AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN

## ఆల్‌టైం కనిష్టానికి రూపాయి..



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** డాలర్ వద్ద భారత కరెన్సీ రూపాయి ఆల్‌టైం కనిష్ఠానికి పతనమైంది. డాలర్ తో పోలిస్తే శుక్రవారం రూపాయి విలువ ఏకంగా 98 పైసలు నష్టపోయి.. రూ.89.66 వద్ద ముగిసింది. రూపాయి విలువ 89 మార్క్‌ను దాటడం ఇదే తొలిసారి. 2022 ఫిబ్రవరి 24న రూపాయి 99 పైసలు నష్టపోయింది. గడిచిన మూడేళ్లలో ఎన్నడూలేని రీతిలో ఒక్కరోజులోనే రూపాయి 98 పైసలు నష్టపోయింది. ఏడాది కాలంలో ఇప్పటి వరకూ రూపాయి విలువ 4.6 శాతం మేర క్షీణించి.. ఆసియాలోనే అత్యంత బలహీనపడిన కరెన్సీగా నిలిచింది.

## కోస్తాంధ్ర.. రాయలసీమకు ఎల్లో అలర్ట్



**అక్షరటుడే, ఏపీ :** మలక్కాదక్షిణ అండమాన్ సముద్రం మధ్య అల్పపీడనం ఏర్పడింది. అది పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణించి వాయుగుండంగా మారే అవకాశం ఉంది. నవంబరు 24న ఆగ్నేయ బంగాళాఖాతంలో అది వాయుగుండంగా మారి మరింత బలపడే అవకాశాలున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ మేరకు కోస్తాంధ్ర, రాయలసీమకు అధికారులు ఎల్లో అలర్ట్ ను జారీ చేశారు. రానున్న 48 గంటల్లో రాయలసీమ, దక్షిణ కోస్తా ప్రాంతాల్లో మోస్తారు వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు.


22-11-2025 (Saturday) MAIN EDITION

### అమెజాన్‌లో రికార్డు స్థాయిలో లేఆఫ్స్



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** అమెజాన్ గత నెలలో భారీగా లేఆఫ్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. దాదాపు 14వేల మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ లేఆఫ్స్ ప్రభావం సంస్థలోని దాదాపు అన్ని విభాగాలపై పడింది. అయితే, ఈ లేఆఫ్స్ అత్యధికంగా నష్టపోయింది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లేనని తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

### ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లోకి లక్ష్యసేన్




**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** భారత స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ లక్ష్య సేన్ ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలో ఫైనల్లోకి ప్రవేశించాడు. ప్రపంచంలోని ఆరో నెంబర్ ర్యాంకర్ చౌ తెన్ చెన్‌ను సేన్ ఓడించాడు. చైనీస్ తైపికి చెందిన అతన్ని 17-21, 24-22, 21-16 స్కోరుతో మట్టికరిపించాడు. 86 నిమిషాల పాటు ఆ సెమీఫైనల్ హోరాహోరీగా సాగింది.

### కాప్ సదస్సులో అగ్నిప్రమాదం..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బ్రెజిల్‌లోని బెలెమ్‌లో నిర్వహిస్తున్న ఐక్యరాజ్యసమితి కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ - 30 (కాప్) సదస్సులో అగ్ని ప్రమాదం జరిగింది. ఘటనలో 21 మంది గాయపడ్డారు. మైక్రోవేవ్‌లో మంటలు చెలరేగడంతో ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక అధికారులు భావిస్తున్నారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు




**అక్షరటుడే, హైదరాబాద్:** శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు రావడం కలకలం రేపింది. విమానాశ్రయంలో బాంబు పెట్టినట్లు మెయిల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది తనిఖీలు చేపట్టారు. బాంబు బెదిరింపు మెయిల్ రావడంతో సీఐఎస్ఎఫ్ సెక్యూరిటీ సిబ్బంది విస్తృతంగా తనిఖీ చేశారు. అనుమానిత వస్తువులను పరిశీలించారు. సందర్శకుల పాసుల కౌంటర్ మూసివేశారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు కనిపించకపోవడంతో అది ఫేక్ మెయిల్ అని నిర్ధారించుకున్నారు. దీంతో ఎయిర్ పోర్టు అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

## రవి కేసులో కీలక మలుపు.. సీఐడీ ఎంట్రీ

**అక్షరటుడే, హైదరాబాద్ :** రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తున్న ఐబొమ్మ రవి పైరసీ కేసులో తెలంగాణ సీఐడీ ఎంట్రీ ఇచ్చింది. ఈ మేరకు ఇవాళ కేసుకు సంబంధించి పూర్తి వివరాలను సైబర్ క్రైమ్ పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారుల నుంచి సేకరించింది. అయితే, నిందితుడు రవిని నవంబర్ 6న ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్‌కు రాగా కూకట్‌పల్లిలోని రెయిన్‌బో విస్టా అపార్ట్‌మెంట్‌లో సైబర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టు నిందితుడు రవికి ఐదు రోజుల పోలీసు కస్టడీ మంజూరు చేసిన విషయం తెలిసిందే.

**పంచాయతీ ఎన్నికల కోసం ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. డిసెంబర్‌లో ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఏ గ్రామం ఎవరికి రిజర్వ్ అవుతోందని పల్లెల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఈ క్రమంలో ప్రభుత్వం రిజర్వేషన్ల అమలుపై శనివారం జీవో విడుదల చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 50 శాతం మించకుండా రిజర్వేషన్లు ఖరారు చేయాలని జీవో నంబర్ 46 జారీ చేసింది. బీసీ డెడికేషన్ కమిషన్ నివేదిక, సుప్రీం తీర్పు, పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆదేశించింది.** -అక్షరటుడే, హైదరాబాద్

# జీపీ ఎన్నికల రిజర్వేషన్లపై జీవో




- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం
- 50 శాతం మించకుండా ఖరారు చేయాలని ఆదేశం
- లాటరీ ద్వారా మహిళా రిజర్వేషన్లు

జీపీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తామని గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా రిజర్వేషన్ల ఖరారు కోసం ఉత్తర్వులు జారీ చేసింది. మూడు నాలుగు రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. అయితే సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఇంకా ప్రకటించలేదు. ఏ స్థానం ఎవరికి రిజర్వ్ అవుతుందోనని ప్రజలు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేయడానికి మార్గదర్శకాలు విడుదల చేసింది. వార్డు స్థానాల రిజర్వేషన్లను ఎంపీడీవోలు, సర్పంచ్ రిజర్వేషన్లను ఆర్డీవోలు ప్రకటించనున్నారు. ఒకటి రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుంది. 2024లో నిర్వహించిన కులగణన ఆధారంగా వార్డు సభ్యుల రిజర్వేషన్ కేటాయిస్తారు. సర్పంచ్ స్థానాలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లు కుల గణన ఆధారంగా, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు 2011 జనాభా లెక్కల ప్రకారం అమలు చేయనున్నారు.

### రోటేషన్ పద్ధతిలో..

రిజర్వేషన్లను రొటేషన్ పద్ధతిలో అమలు చేయనున్నట్లు ప్రభుత్వం జీవోలో పేర్కొంది. సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, విద్య సర్వే ఆధారంగా రిజర్వేషన్ కేటాయింపు ఉంటుందని వెల్లడించింది. వంద శాతం ఎస్టీలు ఉన్న గ్రామాల్లో అన్ని వార్డులు, సర్పంచ్ స్థానాలు ఎస్టీలకు రిజర్వ్ చేసి ఉంటాయని స్పష్టం చేసింది. గత ఎన్నికల్లో వార్డులు, గ్రామాలకు కేటాయించిన రిజర్వేషన్‌ను అదే కేటగిరీకి మళ్లీ రిజర్వ్ చేయొద్దని స్పష్టం చేసింది. మొదట ఎస్సీ రిజర్వేషన్లు ఖరారు చేయాలని, అనంతరం ఎస్సీ, బీసీలకు సీట్లను కేటాయించాలని తెలిపింది. మహిళా రిజర్వేషన్ కోసం అన్ని కేటగిరీల్లో 50 శాతం అమలు చేయాలి. లాటరీ ద్వారా మహిళా రిజర్వేషన్లను కేటాయించాలని పేర్కొంది. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

## 37 మంది మావోయిస్టుల లొంగుబాటు



**అక్షరటుడే, హైదరాబాద్ :** మావోయిస్ట్ పార్టీకి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. 37 మంది మావోయిస్టులు తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. మేరకు డీజీపీ శివధర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. తెలంగాణకు చెందిన ఇద్దరు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 35 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యల సాంబయ్య అలియాస్ ఆజాద్, నారాయణ అలియాస్ రమేశ్, సోమ్‌దా అలియాస్ ఎర్ర ఉన్నట్లు డీజీపీ తెలిపారు. ఏవోబీ ప్రాంతంలో పార్టీ నిర్మాణంలో ఆజాద్ కీలక పాత్ర పోషించాడు. ఆయనపై రూ.20 లక్షల రివార్డు ఉన్నట్లు డీజీపీ తెలిపారు. లొంగిపోయిన వారిలో 25 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. ఖమ్మం డివిజన్ సభ్యులు 9 మంది సరెండర్ అయ్యారు. వారి నుంచి 303 రైఫిల్, జీ3 రైఫిల్, ఎస్ఎల్ఆర్, ఏకే47 రైఫిల్, బుల్లెట్లు, క్యాట్రేజ్ స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది మొత్తం 465 మంది మావోయిస్టులు తెలంగాణ ప్రభుత్వం ముందుకు వచ్చి లొంగిపోయారని డీజీపీ వెల్లడించారు. రాష్ట్రానికి చెందిన 59 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని చెప్పారు.

## ఫార్ములా ఈ–రేసు కేసులో ఏసీబీ ఫైనల్ రిపోర్టు




**అక్షరటుడే, హైదరాబాద్:** ఫార్ములా ఈకారు రేస్ కేసులో ఏసీబీ ఫైనల్ రిపోర్ట్ సమర్పించింది. హైదరాబాద్‌లో ఫార్ములా ఈరేస్ నిర్వహించడం కేటీఆర్ సొంత నిర్ణయమని పేర్కొంది. బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్‌లో ఫార్ములా ఈ-రేసు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో అవినీతి జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం ఏసీబీ విచారణకు ఆదేశించింది. విచారణ చేపట్టిన ఏసీబీ తుది నివేదికను తాజాగా ప్రభుత్వానికి అందజేసింది. ప్రభుత్వ అనుమతులు లేకుండానే ప్రైవేటు డిస్కషన్లతో రేస్ నిర్వహించినట్లు ఏసీబీ తెలిపింది. ఈ కేసులో ఏ1 మాజీ మంత్రి కేటీఆర్, ఏ2 ఐఏఎస్ అధికారి అరవింద్, ఏ3 బీఎల్ఎన్ రెడ్డి, ఏ4, ఏ5గా ఎఫ్ఈవో ప్రతినిధులను చేర్చారు.

### బీఆర్ఎస్‌కు రూ.44 కోట్లు

అనుమతులు లేకుండానే రేస్ నిర్వహించడంతో క్విడ్ ప్రో కో జరిగిందని వివరించారు. దీంట్లో భాగంగా బీఆర్ఎస్‌కి రూ.44 కోట్ల ఎలక్ట్రోరల్ బాండ్లు అందాయని నివేదికలో అధికారులు పేర్కొన్నారు. ట్రై పార్టీ అగ్రిమెంట్‌కి ముందే ఎలక్ట్రోరల్ బాండ్స్ చెల్లింపులు జరిగాయని వెల్లడించారు. రేసు నిర్వహణ కోసం గవర్నర్ సంతకం లేకుండానే ఐఏఎస్ అధికారి అరవింద్ రెండు ఒప్పందాలపై సంతకం చేశారని చేశారని పేర్కొన్నారు. ఈ రేసు కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 166(1), 299 నిబంధనలను ఉల్లంఘించారని వెల్లడించారు.

## మంత్రి శ్రీధర్ బాబుతో దానం భేటీ

**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో ఎమ్మెల్యేల ఫిరాయింపు ఎపిసోడ్ ఆసక్తి రేపుతోంది. బీఆర్ఎస్ తరఫున గెలుపొంది కాంగ్రెస్ కండువాలు కప్పుకున్న ఎమ్మెల్యేల్లో ఇప్పటికే 8 మంది విచారణ పూర్తి కాగా కడియం శ్రీహరి, దానం నాగేందర్ వ్యవహారం ఉత్కంఠగా మారింది. ఈ క్రమంలో ఇవాళ శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబుతో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఢిల్లీలో నిన్న ఏఐసీసీ పెద్దలు, న్యాయ నిపుణులతో సమావేశమైన దానం ఇవాళ శ్రీధర్ బాబుతో సమావేశం కావడంతో దానం ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నారని రాజకీయ వర్గాల్లో చర్చనీయాశంగా మారింది.

## హిందువులు ఉన్నంత వరకే ప్రపంచం ఉంటుంది




**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హిందువులు ఉన్నంత వరకే ప్రపంచం ఉంటుందన్నారు. హిందువులు లేని రోజు ప్రపంచం అంతమైపోతుందని చెప్పారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ మణిపూర్‌లో శనివారం మాట్లాడారు. హిందూ సమాజం ప్రపంచ మనుగడకు కేంద్రబిందువు అని పేర్కొన్నారు. హిందువులు లేకుండా, ప్రపంచం ఉనికిలో ఉండదు అని ఆయన అన్నారు. యునాన్ (గ్రీస్), మిస్ర్ (ఈజిప్ట్), రోమ్ వంటి పురాతన సామ్రాజ్యాలు కాలగర్భంలో కలిసిపోయాయన్నారు. హిందూ నాగరికత అమరమైనదిగా అభివర్ణించారు. మన సమాజంలో ఒక నెట్‌వర్క్‌ను సృష్టించామని, దాని కారణంగా హిందూ సమాజం ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. సాంస్కృతిక ప్రాముఖ్యతను నొక్కి చెప్పడమే కాకుండా భారతదేశం ఆర్థిక స్వావలంబనపై దృష్టి పెట్టాలని భగవత్ కోరారు. సైనిక, జ్ఞాన సామర్థ్యాలతో పాటు దేశ నిర్మాణానికి ఆర్థిక బలం కీలకమని ఆయన పేర్కొన్నారు.

## విశ్వప్రేమకు ప్రతిరూపం సత్యసాయి



**అక్షరటుడే, ఏపీ:** విశ్వప్రేమకు ప్రతిరూపం సత్యసాయి అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. సత్యసాయి మహాసమాధిని దర్శించుకోవడం తన అదృష్టమన్నారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో నిర్వహించిన శత జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. సాయి కుల్వంత్ హాల్‌లో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనతంరం రాష్ట్రపతి ప్రసంగించారు. సత్యసాయి బోధనలు లక్షల మందికి మార్గం చూపాయన్నారు. ఆయన సందేశంతో కోట్ల మంది భక్తులు మానవ సేవ చేస్తున్నారని చెప్పారు. సత్యసాయి ట్రస్టు ద్వారా ఎంతో మందికి వైద్య సేవలు అందించారన్నారు. ఈ ట్రస్టుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నానని రాష్ట్రపతి అన్నారు.

## ఉప ఎన్నికలు వస్తే.. మళ్లీ పోటీ చేస్తా: కడియం



**అక్షరటుడే, వరంగల్ :** ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై ఈ నెల 23వ తేదీలోపు సమాధానం ఇవ్వాలని స్పీకర్ నోటీసు ఇచ్చినట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. నోటీసులపై మరింత సమయం కావాలని స్పీకర్‌ను కోరినట్లు పేర్కొన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. స్పీకర్ ఇచ్చిన సమయంలోగా వివరణ ఇస్తానని చెప్పారు. స్పీకర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని వెల్లడించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నానని వివరించారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి పెద్దఎత్తున అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని తెలిపారు. 'కడియం శ్రీహరి భయపడడు. ఉప ఎన్నికలు వచ్చిన పక్షంలో మళ్లీ పోటీ చేస్తా. ప్రజలు ఆశీర్వదిస్తారన్న నమ్మకం నాకు ఉంది' అని పేర్కొన్నారు.

## వివాదంలో యాంకర్ శివజ్యోతి..

యాంకర్ శివజ్యోతి వివాదంలో చిక్కుకున్నారు. ఎంతో మంది భక్తులు పవిత్రంగా భావించే తిరుమల శ్రీవారి ప్రసాదంపై ఆమె చేసిన వ్యాఖ్యలను భక్తులు ఖండిస్తున్నారు. శివజ్యోతి తన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారి దర్శనానికి వెళ్లారు. క్యూ లైన్‌లో ఉన్న సమయంలో భక్తులకు ఇచ్చే ప్రసాదాన్ని ఆమె తీసుకున్నారు. ప్రసాదం తీసుకోవడంపై ఆమె వీడియో తీశారు. తిరుపతిలో కాస్ట్లీ ప్రసాదం అడుకున్నామంటూ కామెంట్ చేశారు. రిచెస్ట్ బిచ్చగాళ్లం అని శివజ్యోతి వ్యాఖ్యలు చేశారు. ఆమె తీరుపై భక్తులు, హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఉచితంగా ఇచ్చే స్వామి వారి ప్రసాదాన్ని అడుక్కోవడం అనడం, నవ్వుతూ కామెంట్ చేయడంపై మండిపడుతున్నాయి. భక్తులకు శివ జ్యోతి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాయి.

– అక్షరటుడే, హైదరాబాద్

